అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా



వ్యర్థాలతో నిండిపోయిన సచివాలయం మేడపై భాగం

- భవానీగార్డెన్స్ సచివాలయం వద్ద మందుబాబుల చిందులు
- సులభ్ కాంప్లెక్స్ వద్దా అదే పరిస్థితి
- ఇబ్బంది పడుతున్న స్థానికులు, సచివాలయ సిబ్బంది



అపరిశుభ్రంగా సులభ్ కాంప్లెక్స్ నుంచి సచివాలయానికి వెళ్లే మార్గం



భవానీగార్డెన్స్ సచివాలయం



సులభ్ కాంప్లెక్స్ వద్ద మందు సీసాలు, వ్యర్థాలు

కంచరపాలెం: జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి పరిధి తుమ్మడపాలెం భవానీగార్డెన్స్ సచివాలయం, సులభ్ కాంప్లెక్స్, శ్మశాన వాటిక పరిసర ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారినట్లు స్థానికులు, సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. చీకటి పడితే ఆకతాయిల ఆగడాలు మితిమీరుతున్నాయి. మందుబాబులు సచివాలయ భవనంపై నిత్యం రాత్రిపూట చిందులు వేస్తున్నారు. వీధి లైట్లు ఆర్పేసి చీకట్లో మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్లేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికేతర యువత సచివాలయ భవనాన్ని ఇలా మత్తు పదార్థాలు సేవించడానికి వినియోగిస్తుంటే స్థానిక యువత చెడు మార్గాన్ని అనుసరిస్తారని ఆ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి తాగేసిన మందు సీసాలు, సిగరెట్ పీకలు పరిసరాల్లో వదిలేడంతో దుర్గంధభరితంగా మారుతున్నాయి. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పారిశుధ్య సిబ్బందికి వాటిని తొలగించమని అడిగితే దురుసుగా సమాధానం చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

పరిసరాలు అధ్వానం..

తుమ్మడపాలెం భవానీగార్డెన్స్ సచివాలయ పరిసరాలు అధ్వానంగా మారాయి. ముందుబాబులు వేసే వ్యర్థాలు సగమైతే జోన్-5 ఇంజినీరింగ్ అధికారులు కాంక్రీట్ సామగ్రి, సిమెంట్ దిమ్మలు వేయడంతో సచివాలయ సిబ్బంది, వినియోగదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పబ్లిక్ హెల్త్, పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అడ్డుకట్ట వేయాలి..

సచివాలయం మేడపై, శ్మశాస వాటిక ప్రాంతాలను రాత్రిపూట మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. చీకటి పడితే మహిళలు, పిల్లలు అటుగా రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసే నాథుడు కనిపించడంలేదు.

– పి.ఎస్.రవికుమార్, ఐటీఐ జంక్షన్.

అధికారులు స్పందించాలి..

సచివాలయ పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. సిబ్బంది, స్థానికులు రాకపోకలకు భయపడుతున్నారు. రాత్రి పూట పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తే బాగుంటుంది. సంబంధిత అధికారులు స్పందించాలి.

– ఎస్.జ్యోతికుమారి, ఊర్వశి కూడలి

క్లుప్తంగా

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న కార్పొరేటర్ రాజశేఖర్

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి దుర్గానగర్, గోకుల్‌నగర్ తోటవీధిలో జోన్-5 జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఈఈ తారా ప్రసన్నరెడ్డి నేతృత్వంలో పలు అభివృద్ధి పనులకు గురువారం వార్డు స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. సుమారు రూ. 92 లక్షలతో వార్డు అభివృద్ధి జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఈ ఉషారాణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్, గొల్లకంచరపాలెం గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, బింగి రాజురెడ్డి, పల్లా ధర్మారావు, బండారు అప్పలరాజు, యలమంచిలి కనకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాఖ విద్య: ఎస్‌పీడీ ప్రాంతంలోని 11కేవీ పోలీస్‌స్టేషన్ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుసర్ల కాలనీ, రెడ్డి వీధి, బాజీ జంక్షన్, విద్యానగర్, నాయుడు క్వార్టర్స్, రవీంద్ర నగర్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

58వ వార్డు పరిధిలో..

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు 11 కేవీ ఆలూఫ్లోరైడ్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా కోడిపందాలదిబ్బ, రామ్‌నగర్, శ్రీనివాసనగర్, కుంచుమాంబకాలనీ, గుల్లలపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

మర్యాదపూర్వక కలయిక



ఏసీపీ ప్రభాకర్‌నాయుడితో పీవీ సురేష్

మల్కాపురం: ఏసీపీ కింజారపు ప్రభాకర్ నాయుడిని గురువారం పీవీఎస్ హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు, 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 26వ తేదీ గణతంత్ర దినోత్సవం రోజు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా రావాలని ఆహ్వానించారు.

నాదస్వర కళాకారులకు సత్కారం



కచేరీ నిర్వహిస్తున్న నాదస్వర, డోలు కళాకారులు

దాబాగార్డెన్స్: తంజావూర్ జిల్లా తిరువాయూర్ త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవ కమిటీ ఆహ్వానం మేరకు నగరానికి చెందిన నాదస్వర కళాకారులు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్యాగరాజ స్వామి సంకీర్తనలతో శ్రవణానంద భరితంగా నాదస్వర కచేరీ నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. నాదస్వర కళాకారులు పి. దయాకర్, పి. భాస్కర్ (సన్నాయి), కె. గోవిందరావు, గూడూరు నితీష్‌కుమార్ (డోలు) మంజు (తాళం) సహకారంతో పలు త్యాగరాజస్వామి సంకీర్తనలు ఆలపించారు. కచేరీ అనంతరం సత్కరించినట్టు నాదస్వర కళాకారుల కమిటీ సభ్యులు తెలిపారు.

రక్తదానం.. పలువురికి ప్రాణదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ బెహరా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. విద్యా సంస్థల కార్యదర్శి బెహరా విజయ చైతన్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం పలువురికి ప్రణదానమని తెలిపారు. రక్తదానంతో దాత కూడా ఆరోగ్యవంతుడు అవుతారన్నారు. ప్రతి ఒక్కరూ 6 నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 77 యూనిట్ల రక్తం సేకరించినట్లు తెలిపారు. ఏఎస్ రాజా వాలంటరీ బ్లడ్ సెంటర్ సహకారం అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ బి. తరుణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కామేష్ కుమార్, కామేశ్వరరావు, గోవిందరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి కేసు నిందితుడు

దాబాగార్డెన్స్: గంజాయి కేసులో గత కొంత కాలంగా తప్పించుకు తిరుగుతున్న ముద్దాయి పి. ప్రసాద్ అలియాస్ ప్రకాష్‌ను గురువారం వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. సిమ్మర్ శ్రీను, అహ్మద్‌తో కూడిన స్పెషల్ టీమ్ మాటువేసి చాకచాక్యంగా పట్టుకోగలిగారని సీఐ జీడీ బాబు తెలిపారు. పట్టుబడ్డ ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

ప్లాస్టిక్ నిషేధంతో భావితరాలకు స్వచ్ఛ వాతావరణం



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న జేడీ ఫౌండేషన్ సభ్యులు, జీవీఎంసీ సిబ్బంది

గోపాలపట్నం: ప్లాస్టిక్‌ను నిషేధించి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందిద్దామని నినదిస్తూ గోపాలపట్నం రైతు బజారులో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జేడీ ఫౌండేషన్ సభ్యులు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని జీవీఎంసీ నిషేధించిందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. కోరమండల్ ఇంటర్నేషన్ సంస్థ అందించిన గుడ్డ సంచుల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బజారు ఎస్టేట్ అధికారి జి. ప్రసాద్, సచివాలయ కార్యదర్శులు మణికుమార్, చైతన్య కుమారి, శోభారాణి, జేడీ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు



త్యాగరాజ కృతులను ఆలపిస్తున్న ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో వారం రోజుల పాటు వైభవంగా జరిగిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు గురువారంతో ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రఖ్యాత కళాకారుల గాత్ర కచేరీలతో సంగీతప్రియులు తన్మయులయ్యారు. ఉత్సవాలలో 1100 మంది కళాకారులు పాల్గొన్నారని కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. గత 28 సంవత్సరాలుగా త్యాగరాజ ఆరాధనోత్సవాలను నిర్వహిస్తున్నామని, ఈ ఏడాది ఏడు రోజుల పాటు నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు.

అలరించిన రాంబాబు గాత్ర కచేరీ

కళాభారతి, త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తన గాత్ర కచేరీతో సంగీత ప్రియులను అలరించారు. అనంతరం సంగీత కళాభారతి జయలక్ష్మి గాత్ర కచేరీ అద్భుతంగా సాగింది. పంచముఖ ఆంజనేయ స్వామికి 108 వడల మాలను సమర్పించారు. వేద పండితులు చతుర్వేద పారాయణం చేశారు. వందలాది మంది హనుమాన్ చాలీసా పఠనం చేసి హనుమత్ ఉత్సవం నిర్వహించారు. శ్రీరాముడిని అష్టోత్తర శతనామావళితో అర్చించి, ఉత్సవాలకు ముగింపు పలికారు. అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఉత్సవాలను విజయవంతం చేసిన కళాకారులకు, ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

నేతాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలి



నేతాజీకి నివాళులు అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్



క్విజ్ పోటీల్లో గెలుపొందిన సెయింటాన్స్ విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

విశాఖ విద్య: నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్‌లో గల ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం నేతాజీకి నివాళులు అర్పించారు. అనంతరం 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా తెల్లదొరలను దేశం నుంచి పారద్రోలి భారతీయుల చిరకాల వాంఛ ఐన స్వాంతంత్ర్యాన్ని అందించిన మహోన్నతి వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ధైర్యసాహసాలకు నేతాజీ ప్రతీక అని, అహింసావాదం మాత్రమే స్వాతంత్ర్య సాధనకు సరిపోదని, పోరుబాట కూడా ముఖ్యమని నేతాజీ పేర్కొన్నారని తెలిపారు.

నేతాజీ దేశభక్తి నిరుపమానం..

మల్కాపురం: నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించారని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింటాన్స్ కళాశాలలో సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ నేతాజీ చూపిన దేశభక్తి నిరుపమానమని తెలిపారు. క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సీనియర్ అధికారి అనుసూయాదేవి, కళాశాల తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు పౌష్టికాహారం అందించాలి




సమావేశంలో మాట్లాడుతున్న పీడీ జయదేవి

సీతమ్మధార : బాలికలకు తగినంత పౌష్టికాహారం అందేలా చూడాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవి సూచించారు. చిన గదిలి మండలం అంగన్‌వాడీ సిబ్బందికి, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, స్కూల్ నోడల్ టీచర్లు, విద్యా కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బందికి కిశోరీ బాలికల సంరక్షణపై రేసపువానిపాలెంలో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరీ బాలికలు రక్తహీనతకు గురికాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తగినంత పౌష్టికాహారం అందజేస్తున్నామని గుర్తు చేశారు. కౌమార దశ పిల్లల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ నెల 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని పండగలా నిర్వహించాలని సూచించారు. సీడీపీవో ఎం.వి. రమణ కుమారి మాట్లాడుతూ కౌమార దశ అనేది చాలా క్లిష్టమైందన్నారు. మెడికల్ ఆఫీసర్ మన్మోహన్, అప్ హోల్డ్ ఎన్జీవో జిల్లా కో ఆర్డినేటర్ డేవిడ్ రాజ్ వివిధ చట్టాలపై వివరించారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనకు నడుము బిగిద్దాం పేరిట ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏసీడీపీవో శ్రీలత, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హయ్యర్ పెన్షన్‌కు నో

- స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వర్తించదన్న ఆర్‌పీఎఫ్ కమిషనర్లు
- నివ్వెరపోయిన కర్మాగారం పెన్షనర్లు



ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న హయ్యర్ పెన్షన్‌కు ఈపీఎఫ్ అధికారులు నో చెప్పేశారు. డిమాండ్ నోటీసుల మేరకు సొమ్ము చెల్లించి గత 16 నెలలుగా పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న పెన్షనర్లు ఈ వార్త విని నివ్వెరపోయారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల హయ్యర్ పెన్షన్ అంశాన్ని సత్వరమే తేల్చాలని ఇటీవల విశాఖ రీజినల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ల (ఈపీఎఫ్)ను కలిశారు. ఈ సమావేశంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు చెందిన పీఎఫ్ ఎగ్జెంప్టెడ్ ట్రస్టు నిబంధనల ప్రకారం ఆ ఉద్యోగులు, పెన్షనర్లు హయ్యర్ పెన్షన్‌కు అర్హులు కారని వారు తెలిపారు. త్వరలో వారు కట్టిన సొమ్మును చెల్లిస్తామని తెలిపారు.

2,948 మందికి డిమాండ్ నోటీసులు

దేశంలోని ఈపీఎఫ్ పెన్షనర్లకు హయ్యర్ పెన్షన్ వర్తింప చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు విశాఖపట్టణం రీజినల్ పీఎఫ్ కార్యాలయం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 2,948 మందికి డిమాండ్ నోటీసులు జారీ చేశారు. అందులో 400 మంది రిటైర్డ్ ఉద్యోగులతోసహా 1400 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ కోసం సుమారు రూ.400 కోట్లు చెల్లించారు. హయ్యర్ పెన్షన్ వస్తుందని కొంత మంది తమ డిపాజిట్లు తీసేసి డబ్బులు కట్టగా మరికొంత మంది తమ పిల్లల వద్ద తీసుకుని, మరికొంత మంది అప్పులు చేసి ఆ సొమ్ము చెల్లించారు. అప్పటి నుంచి వారు హయ్యర్ పెన్షన్ కోసం ఎదురు చూపులు చూస్తున్నారు. గత 16 నెలలుగా వారు పీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ సిబ్బంది అడిగిన సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఈ అంశంపై ఇటీవల జరిగిన పీఎఫ్ సెంట్రల్ బోర్డు ట్రస్టీల సమావేశంలో సభ్యులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. డిసెంబర్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీలు, సెంట్రల్ పీఎఫ్ బోర్డు ట్రస్టీలు కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి తేగా ఆయన జనవరిలోగా సమస్య పరిష్కరించాలని ఈపీఎఫ్ఓను ఆదేశించారు. కేంద్ర ఈపీఎఫ్ఓ అదనపు కమిషనర్ జనవరి 18న హయ్యర్ పెన్షన్ చెల్లింపులోని సందేహాలకు వివరణ ఇచ్చి వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని దేశంలోని అన్ని రీజినల్ ప్రావిడెంట్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో హయ్యర్ పెన్షన్‌పై ఆశలు పెట్టుకున్న పెన్షనర్లు విశాఖ ఆర్‌పీఎఫ్ఓలను కలిశారు. పీఎఫ్ కార్యాలయంలో ఇద్దరు కమిషనర్లతో సమావేశమవ్వగా వారు తమ నిబంధనల మేరకు ఉక్కు ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ ఇవ్వలేమని తేల్చి చెప్పారు. స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ఎగ్జెంటెడ్ ట్రస్ట్ నిబంధనలు హయ్యర్ పెన్షన్‌కు అనుకూలం కాదని తెలిపారు. దీంతో పెన్షనర్లు తీవ్ర నిరాశతో నీరుగారిపోయారు. గత 16 నెలలుగా హయ్యర్ పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న పెన్షనర్ల పరిస్థితి చూస్తే గుండె తరుక్కుపోతుంది.

కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి...

స్టీల్‌ప్లాంట్ పెన్షనర్లు హయ్యర్ పెన్షన్‌పై విశాఖ ఆర్‌పీఎఫ్ఓ అధికారుల వైఖరిని కేంద్ర కార్మిక శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ నెలాఖరున ఢిల్లీ వెళ్లి తేల్చుకోవడానికి సన్నాహాలు చేస్తున్నారు. అవసరమైతే న్యాయ పరంగా తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం రాజీనామాలు చేయాల్సింది ఉద్యోగులు కాదని.. కూటమి నాయకులని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కార్యదర్శి బి.జగన్ పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1400 రోజుల నుంచి కార్మికులు, ప్రజలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున పోరాడుతున్నట్లు తెలిపారు. ఈ పోరాట ఫలితంగానే స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర ప్రభుత్వం ఒక్క శాతం కూడా ప్రైవేట్‌పరం చేయలేకపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఏ రోజు తమకు ప్యాకేజీ కావాలని కోరలేదన్నారు. బీజేపీ నాయకులు పని గట్టుకుని స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న పోరాటాన్ని అవహేళన చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ఈ ప్యాకేజీ సరిపోకపోతే ఉద్యోగులు రాజీనామాలు చేసి వెళ్లిపోవాలనడం దుర్మార్గం అన్నారు. ప్రజా పోరాటాలను అవహేళన చేసిన వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. ఇప్పటికైనా బీజేపీ, కూటమి నాయకులకు చిత్తశుద్ధి ఉంటే స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలన్నారు. కార్మికులను, పోరాటాలను అవహేళన చేసే ప్రకటనలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయం పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు అంబేడ్కర్ కాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం నిర్మాణ పనులను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ గురువారం పరిశీలించారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.19.45 లక్షల వ్యయంతో శంకుస్థాపన చేసిన పనులు ప్రస్తుతం జరుగుతుండడంతో ఆయన పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంజినీరింగ్ విభాగం ఏఈ రత్నాకర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పార్టీ నాయకుడు శ్యామ్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

నూతన జీవోలతో ఆటో కార్మికులపై అధిక భారం



మాట్లాడుతున్న షేక్ రహ్మాన్

దాబాగార్డెన్స్: ఈ నెల 30, 31 తేదీల్లో విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ రాష్ట్ర 4వ మహాసభలు జరగనున్నాయని విశాఖ జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు షేక్ రహ్మాన్ తెలిపారు. టౌన్ కొత్తరోడ్డు సున్నపువీధి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గా గణపతి ఆటో స్టాండ్‌ను సంఘం ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబుతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధిక జరిమానాలు విధించే జీవో 21, 31 రద్దు చేయాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటోమోటార్ కార్మికులపై రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానాలు విధించే విధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే పెరిగిన ఇన్సూరెన్స్, ఆర్టీఏ చలానా చార్జీలు సకాలంలో చెల్లించుకోలేక ఇబ్బందులు పడతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కొత్త జీవోలు తీసుకురావడం వల్ల ఆటో మోటార్ కార్మికుల పీకకు ఉరి తగిలించే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రెండు జీవోలు వెంటనే రద్దు చేయాలని, భారీగా పెరిగిన ఆర్టీఏ చలానా చార్జీలు తగ్గించాలని, పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు జీఎస్టీ పరిధిలోకి తేవాలని, ఆటో కార్మికులకు ఆదాయం పెరిగే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్. సత్యనారాయణ, జి. సతీష్, బి. వేణుగోపాల్, డి. జగ్గారావు, జి. పాపారావు, బి. సూర్యనారాయణ, వి. శ్రీను, జి. త్రినాథ్, టి. శ్రీనివాసరావు, ఎస్. రాము తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాలయం పరస నేడు

అక్కిరెడ్డిపాలెం : జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్ హౌస్ అండ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ కోదండ రామాలయం పరస మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు రాంనగర్ గ్రామ పెద్దల కమిటీ, రామ భజన కమిటీ, యూత్ కమిటీ ప్రతినిధులు గురువారం తెలిపారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.